క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంఘ కార్యవర్గం ఎన్నిక



ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం

ఏలూరు (టూటౌన్): ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక జిల్లా కోర్టు ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా న్యాయవాదులు చిన్నం సుధీర్, మాంద్రు రాజేంద్ర హాజరయ్యారు. అధ్యక్షుడిగా పయనం రత్నరాజు, గౌరవ అధ్యక్షుడిగా చెల్లెం రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా మద్దాల వాసుదేవరావు, ప్రధాన కార్యదర్శిగా గోధుమ తిరుపతి స్వామి, జాయింట్ సెక్రెటరీగా కాళంగి మనోహర్, కోశాధికారిగా అంబటి మణి కుమార్, మహిళా ప్రతినిధిగా ఓగిరాల సుజాతలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, మాజీ అధ్యక్షుడు కలిసిపూడి రాజబాబు, మాజీ గౌరవ అధ్యక్షుడు కారంపూడి జనార్ధనరావు, నోముల రాముడు తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు విష్ణు పర్యటన

ఏలూరు(మెట్రో): రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు శనివారం ఏలూరు కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసే కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లాలో నవరత్నాలు కార్యక్రమం అమలుపై అధికారులతో సమీక్షిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రెస్‌మీట్‌లో మాట్లాడతారు. అనంతరం విజయవాడ బయలుదేరి వెళతారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 204 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ పరీక్షలు మూడో రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నిర్వహించిన మొదటి సెమిస్టర్ పరీక్షలకు 64 మంది విద్యార్థులకు 63 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన 4వ సెమిస్టర్ పరీక్షలకు 144 మంది విద్యార్థులకు 141 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులేవీ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. స్థానిక కోటదిబ్బ ఎస్ఆర్ వన్ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కార్మిక సంఘ నేతలు ఎ.అప్పలరాజు, ఎస్ఎంపీ సుబ్బారావు, సీహెచ్ హరినాథ్‌బాబు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విఘ్నాలు తొలగించు.. విఘ్నేశ్వరా

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగర ప్రజలందరికీ విఘ్నాలు తొలగి విజయం కలగాలని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు ఆకాంక్షించారు. స్థానిక పవర్‌పేటలోని విజయ గణపతి ఆలయంలో వినాయక పాంచాహ్నిక పూజాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి గరిక పూజ, పంచామృత అభిషేకాలు మేయర్ నూర్జహాన్ దంపతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవర్‌పేట విజయ గణపతి ఆలయం వందేళ్ల చరిత్ర కలిగిందన్నారు. వినాయక చవితి పర్వదినాల్లో ఏటా వేలాది మంది భక్తులు ఆలయానికి వచ్చి గణపతి స్వామి వారిని దర్శించుకుని వెళ్తారని తెలిపారు. కందుకూరి వారి వంశపారంపర్యంగా ప్రధాన అర్చకులుగా ఆలయాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో భక్తులకు సేవలు చేస్తుంటారన్నారు. స్వామివారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఉండాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సుభిక్షంగా పరిపాలించే శక్తిని, ఎమ్మెల్యే ఆళ్ల నాని ఏలూరు నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించాలని భగవంతుని ప్రార్థించామని చెప్పారు. ప్రధాన అర్చకులు కందుకూరి గోపాల్ త్రినాథ మూర్తి, కందుకూరి విజయ్, వెంపటి శర్మ, తదితరులు పూజలు నిర్వహించారు.

ఘనంగా చండీ హోమం

జ్యూట్‌మిల్లు వద్ద ధర్మభేరి ప్రాంగణంలో వాణిజ్యవేత్త నారా శేషు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్రిశూల వినాయక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం లోక కల్యాణార్థం చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో నారా శేషు, నారా హనుమ దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కరెన్సీ గణపతి

సత్రంపాడు లక్ష్మీ గణపతి ఆలయంలో దేవదాయ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి విశేష పూజలు చేశారు. స్వామి వారికి కరెన్సీతో ప్రత్యేక అలంకరించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎం విజయరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలను దేవదాయ జిల్లా అధికారి చెన్ను రంగారావు పర్యవేక్షించారు. పలువురు కార్యనిర్వహణాధికారులు పాల్గొన్నారు.




విజయ గణపతి ఆలయంలో పూజ చేస్తున్న మేయర్ నూర్జహాన్, పెదబాబు



చండీ హోమం నిర్వహిస్తున్న నారా శేషు దంపతులు




కరెన్సీ అలంకరణలో సత్రంపాడు లక్ష్మీగణపతి




రమామహల్ సెంటరులో వినాయకుడు



పడమరవీధిలో త్రిముఖ దశావతారంలో



దొంగల మండపం వద్ద..



నర్సింహరావుపేటలో ..

ఘంటా ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలకు ఖండన

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్‌పై టీడీపీ నాయకుడు, గౌడ సంఘ నాయకుడు చలమోలు అశోక్‌గౌడ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను దెందులూరు నియోజకవర్గ గౌడ సంఘ నాయకులు, బీసీ నేతలు ముక్త కంఠంతో ఖండించారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 21న దెందులూరులో నిర్వహించిన టీడీపీ నిరసన దీక్షలో అశోక్‌గౌడ్ మాట్లాడుతూ ఘంటా ప్రసాద్‌పై వ్యక్తిగత దూషణలు చేయడంతో పాటు అసభ్య పదజాలాన్ని ఉపయోగించడం అత్యంత హేయమైనదిగా అభివర్ణించారు. ఘంటా ప్రసాద్ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పనిచేస్తూ అంచెలంచెలుగా ఈ స్థాయికి ఎదిగారని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అంతా పర్యటించి బీసీల్లో ఐక్యతను పెంపొందించి పార్టీ బలోపేతానికి కృషి చేశారని వివరించారు. ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగానే ప్రసాద్ సతీమణి పద్మశ్రీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని అప్పగించారని వివరించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేవంటూ దుష్ప్రచారం చేయడంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం అశోక్ గౌడ్‌కు తగవని హితవు పలికారు. ఘంటా ప్రసాద్‌పై చేసిన అనుచిత వాఖ్యలను వెనక్కి తీసుకుని ఆయనకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దెందులూరు నియోజకవర్గ గౌడ, బీసీ నాయకులు కట్టా యేసుబాబు, మేకా లక్ష్మణరావు, తాతా సత్యనారాయణ, బెజవాడ నరసింహారావు, పి.అచ్యుత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

ఏలూరు టౌన్: మద్యం సేవించి ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపినా, సరైన ధ్రువ పత్రాలు లేకుండా రోడ్లపైకి వచ్చినా చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ హెచ్చరించారు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఆయన తన సిబ్బందితో వాహన తనిఖీలు నిర్వహించారు. కార్లు, మోటారు సైకిల్‌పై ప్రయాణించే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. పలువురు సరైన ధ్రువపత్రాలు చూపించకపోవటంతో చలానాలు విధించటంతోపాటు, కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని, మోటారు సైకిళ్లపై ప్రయాణించేవారు లైసెన్సు, వాహన పత్రాలు కలిగి ఉండాలని తెలిపారు. మితిమీరిన వేగంతో ప్రయాణించకుండా కుటుంబాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని తెలిపారు.



బ్రీతింగ్ ఎనలైజర్ పరీక్ష చేస్తున్న సీఐ రాజశేఖర్

పోలీస్ విధులపై అవగాహన



టూటౌన్ స్టేషన్‌లో చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల స్పందన, పోలీస్ స్టేషన్‌లో విధుల నిర్వహణపై స్కూల్ చిన్నారులకు పోలీస్ సిబ్బంది వివరించారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు టూటౌన్ సీఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నగరంలోని ఒక ప్రైవేటు స్కూల్ చిన్నారులకు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం ఏర్పడితే స్టేషన్‌లోని వైర్‌లెస్ సిస్టమ్ ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బందికి సమాచారం ఏ విధంగా చేరవేస్తారనే విషయాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సమాచారం ఇతర ప్రాంతాలకు చేరవేసే విధానాన్ని తెలిపారు. చిన్నారులంతా శ్రద్ధగా, ఆసక్తిగా సిబ్బంది చెప్పే మాటలు విన్నారు. టూటౌన్ ఎస్సై శుభ శేఖర్, సిబ్బంది చిన్నారులకు అవగాహన కల్పించారు.

పిల్లలను తిరిగి స్కూళ్లలో చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో బడి బయట ఒక్క పిల్లాడు కూడా ఉండకూడదని, వయస్సు వారీగా, తరగతుల వారీగా ప్రతి ఒక్కరికీ విద్య అభ్యసించేలా చర్యలు చేపట్టాలని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ అన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్ జీఈఆర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. 10వ తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి స్కూళ్లలో చేర్పించాలని, వయస్సు పైబడిన వారిని ఓపెన్ స్కూల్లో చేర్పించాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు తిరిగి తర్ఫీదు ఇప్పించి ఉత్తీర్ణులు అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్ ఫెయిలైన విద్యార్థులను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో చేర్పించి వారిలోని నైపుణ్యాలను వెలికితీయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో యువత, విద్యార్థులను గుర్తించి వారికి విద్యతో కలిగే ప్రయోజనాలు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో నగరంలోని వార్డు సచివాలయం ఎడ్యుకేషన్ సెక్రటరీలు, వలంటీర్లు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు హాజరుకావాలని కోరారు.

ఉత్తమ భవిష్యత్తు దిశగా ప్రతి విద్యార్థీ అడుగేయాలి

పెదవేగి : క్రీడల్లో ప్రతిభ విద్యార్థిని ఉన్నతస్థాయిలో నిలుపుతుందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి సాధన చేయాలని పెదవేగిలోని ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. దెందులూరు నియోజకవర్గం స్థాయిలో నిర్వహిస్తున్న 14, 17 ఏళ్ల విభాగం క్రీడాపోటీలు పెదవేగి గురుకుల విద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుని దాన్ని సాధించడానికి పట్టుదలతో కృషి చేయాలన్నారు. విద్యార్థి జీవితంలో క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. ప్రతి విద్యార్థి మరింత మెరుగైన ప్రతిభతో ముందుకెళ్లాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు, నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజగోపాల్, మండల కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు మల్లికార్జున్, రఫీ పాల్గొన్నారు



లాంగ్ జంప్ చేస్తున్న బాలిక

ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన సదస్సు

దెందులూరు: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల రైతుల అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా అమలు చేస్తున్న రాయితీలను రైతులు అవగాహన పెంపొందించుకుని సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు నియోజకవర్గ ఉద్యానవనశాఖాధికారి బీ.కిరణ్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పండ్ల తోటలు, కూరగాయలు, పూల మొక్కల సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందన్నారు. మామిడికి ఎకరాకు రూ. 7,980, జామకు రూ.17,599, బత్తాయి, నిమ్మకు రూ.962, డ్రాగన్ ఫ్రూట్‌కు రూ.30 వేలు, పనస, నేరేడు తోటలకు రూ. 18 వేలు, కూరగాయల తోటలకు రూ.20 వేలు, పామాయిల్ ఒక మొక్కకు రూ.193, కోకో ఎకరాకు రూ. 12 వేలు అందిస్తుందన్నారు. బొప్పాయి, అరటి, కొబ్బరి శాశ్వత పందిళ్ల ఏర్పాటుకు సబ్సిడీపై రుణాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. రైతులు భూమిలో తేమను కాపాడుతూ కలుపు మొక్కల నివారణకు ప్లాస్టిక్ కవర్ల ఏర్పాటుకు రూ. 16 వేలు, 16 లీటర్ల సామర్థ్యం కలిగిన తైవాయిన్ స్ప్రేకు రూ.8 వేలు సబ్సిడీ అందిస్తుందన్నారు. రైతులు ఈ రాయితీలు పొందడానికి మొక్కలు కొన్న బిల్లు, ఆధార్ జెరాక్స్, బ్యాంకు అకౌంట్ జెరాక్స్, రైతు భరోసా కేంద్రాలు, ఉద్యానవన శాఖ గ్రామ, మండల అధికారులను సంప్రదించాలని నియోజకవర్గ ఉద్యానవన శాఖాధికారి బీ.కిరణ్ అన్నారు.

సీఎం జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే తలారి

ద్వారకాతిరుమల: నియోజకవర్గంలో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక అనుమతులు ఇవ్వాలని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం కోరారు. అసెంబ్లీ సమావేశం అనంతరం ఎమ్మెల్యే తలారి సీఎంను కలసి, గృహ నిర్మాణ సమస్యలను వివరించారు. మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారందరికీ, అలాగే ప్రస్తుతం సొంత స్థలాల్లో శ్లాబ్‌లు వేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలని కోరారు. గోపాలపురం నియోజకవర్గంలో ఫస్ట్ ఫేజ్‌లో నామమాత్రంగా గృహాలు మంజూరయ్యాయని, ప్రస్తుతం జరుగుతున్న సెకండ్ ఫేజ్‌లో ఎక్కువ గృహాలను ప్రత్యేకంగా మంజూరు చేయాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ దృష్టికి వచ్చిన లబ్ధిదారులందరికీ గృహ రుణాలు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలని, హామీలను అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో శుక్రవారం నగరపాలక సంస్థ ఎదుట ధర్నా చేశారు. ఆప్కాస్ కార్మికులకు ప్రతినెలా జీతంతో పాటు హెల్త్ అలవెన్స్ ఓహెచ్ఓ ఇవ్వాలని, మున్సిపాలిటీ కార్మికులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భజంత్రీ శ్రీనివాసరావు, యలగాడ దుర్గారావు, దొడ్డికర్ల నాగబాబు, బంగారు దుర్గాప్రసాద్, కిలారి వెంకన్న బాబు, మాదుగుల జగదీష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	32

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	17
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	29
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	21
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	30
ఏలూరు -తిరుపతి	16.00	4830	33

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	20	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	100
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	04-06
బెండకాయలు	24	కంద	50
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	24-28	కీరా దోస	50
బీరకాయలు	26	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	40	అల్లం	120-220
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	06
దోసకాయలు	24-28	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	48
		నిమ్మకాయలు (డజను)	--

నేడు ఏలూరులో చినవెంకన్న కల్యాణం

ద్వారకాతిరుమల: ఏలూరు జూట్‌మిల్ సమీపంలోని ధర్మభేరి ప్రాంగణంలో శనివారం చినవెంకన్న కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. అందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్టు చెప్పారు. వేడుకలో భాగంగా స్వామివారి ధర్మ ప్రచార రథం ఉదయం ఆలయం నుంచి బయల్దేరి ధర్మభేరి ప్రాంగణానికి చేరుకుంటుందన్నారు. ఉత్సవం పూర్తయిన తర్వాత తిరిగి ఆలయానికి చేరుకుంటుందని చెప్పారు. భక్తులు ఈ వేడుకలో పాల్గొనాలని ఆయన కోరారు.

బంగారు వ్యాపారిపై దాడి

ఏలూరు టౌన్: ఏలూరు వన్ టౌన్ దక్షిణపు వీధి గోల్డ్ వ్యాపారిపై గుర్తు తెలియని వ్యక్తులు ముగ్గురు దాడి చేశారు. అతని వద్ద ఉన్న బ్యాగు అపహరించిన పరారయ్యారు. వన్ టౌన్ గడియార స్తంభం వద్ద ఎస్‌వీఎస్ గోల్డ్ వ్యాపారి సూరే వెంకట శివాజీ దుకాణం ముగించుకొని ఇంటికి ఎందురుగా గేటు వేస్తున్న సమయంలో వెనుక నుంచి ముగ్గురు వ్యక్తులు వచ్చి దాడి చేసి బ్యాగు అపహరించి పారిపోయారు. బ్యాగులో రూ.30 వేలు నగదు, దుకాణం తాళాలు ఉన్నట్లు బాధితుడు తెలిపాడు. గాయపడిన గోల్డ్ వ్యాపారస్తుడ్ని ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



చికిత్స పొందుతున్న వెంకట శివాజీ